క్లుప్తంగా

చెస్ బాక్సింగ్ పోటీలకు సంస్కృతి విద్యార్థులు



చెస్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పరవాడ: వెస్ట్ బెంగాల్(డార్జిలింగ్) చెస్ బాక్సింగ్ ఆర్గనైజింగ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించనున్న 11వ జాతీయ స్థాయి చెస్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రిష్ దేవని, ప్రియాంష్ సింగ్, ఎస్.హరిన్, ఐ.కౌశిక్, కె.అభిరామ్, ఎల్.సాకేత్, బి.తేజశ్రీ, ఎ.నవ్యశ్రీ, ఎం.హసినీ, జి.హర్షిత, ఎ.హర్షిత, వి.వైష్ణవి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి, సీఈవో కె.నిశాంత్, ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి శనివారం అభినందించారు.

కారు బోల్తా

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో ఓ కారు బోల్తాపడింది. డివైడర్‌పైకి పైకి దూసుకుపోయి తిరగబడింది. ట్రాఫిక్ ఎస్.ఐ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. హనుమంతవాక నుంచి అడవివరం వైపు కారులో ఓ వ్యక్తి బీఆర్‌టీఎస్ రోడ్డులో మధ్యలైన్‌లో వెళుతున్నాడు. ఆయన మితిమీరిన వేగంతో నడుపుతున్న కారు పైనాపిల్‌కాలనీ కూడలి ముందు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిపైకి బోల్తాపడింది. దీంతో కారులో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద శబ్దం రావడంతో కాలనీవాసులు అక్కడకు పరుగున చేరుకొన్నారు. కారులో ఉన్న వ్యక్తిని బయటకు తీశారు. విషయం తెలుసుకొన్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారును డివైడర్ పైనుంచి తొలగించారు.

సంఘ విద్రోహశక్తులపై చర్యలకు డిమాండ్

పరవాడ: మణిపూర్‌లో మహిళలపై దారుణాలకు పాల్పడుతున్న సంఘ విద్రోహశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలో దోషులను శిక్షించాలని కోరుతూ పెదముషిడివాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రమణి మాట్లాడుతూ మానవత్వాన్ని మంట గలిపే విధంగా మహిళలను నగ్న ప్రదర్శన జరపడం దారుణమన్నారు. గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని రమణి డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో అక్కమ్మ, లక్ష్మి, భూలక్ష్మి, పార్వతి, కనక, రత్నమాల, దేవి తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమో పారామెడికల్ కోర్సుల గడువు పొడిగింపు

అక్కిరెడ్డిపాలెం: డిప్లొమా పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ గడువును పొడిగించినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. 14 డిప్లొమా పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ పాసైన అభ్యర్థులు అర్హులని తెలియజేశారు. డిప్లొమా ఇన్ అనస్థీషియా, ఎం.ఎల్.టి, రేడియాలజీ, ఆప్తో మెట్రి టెక్నీషియన్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఆడియో మెట్రి టెక్నీషియన్, డీఎంఎస్‌టీ, కార్డియాలజీ, క్యాథ్ ల్యాబ్, డయాలసిస్, రెస్పిరేటరీ థెరపీ, పెర్ఫ్యూజన్, మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు యథావిధిగా జరుగుతాయన్నారు. కన్వీనర్ కోటాకు ఆగస్టు 19 వరకు, మేనేజ్‌మెంట్ కోటాకు సెప్టెంబర్ 14వ తేదీ వరకు గడువు పొడిగించారని తెలియజేశారు. కన్వీనర్ కోటాలో అడ్మిషన్ తీసుకున్న వారికి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. వివరాలకు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో నేరుగా లేదా 7207953919, 7995013421 నంబర్లలో ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

నేడు చిత్రలేఖనం పోటీలు

దాబాగార్డెన్స్ : కళని, కళా సంస్కృతిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశంతో కళాయజ్ఞ–జీవన రేఖలు ఏకవర్ణ చిత్రకళా ప్రదర్శన ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవనరేఖలు చిత్రకళా ప్రదర్శన ఉదయం 10 గంటలకు , మధ్యాహ్నం 2 నుంచి ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న పిల్లలకు ప్రవేశ రుసుం లేకుండా చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



దిబ్బలగొర్లివానిపాలెంలో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. చింతలగొర్లివానిపాలెంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. అనంతరం రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, కొత్త గొర్లివానిపాలేనికి రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, దిబ్బలగొర్లివానిపాలెంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన ఏడాదిలోనే మేనిఫెస్టోలో పొందుపర్చిన 95 శాతం హామీలు నెరవేర్చి చరిత్ర సృష్టించారన్నారు. సీఎం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. తద్వారా ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అధికారులు, రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేయడంపై హర్షం వ్యక్తమవుతుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఫలితంగా ప్రభుత్వ పాలన సులభతరమవుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సచివాలయాల ఉద్యోగులు తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, రాష్ట్ర యువజన విభాగం ప్రతినిధి గొర్లి గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి,పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సింహగిరికి ఏకాదశి శోభ

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. క్యూ లైన్లలో బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. అలాగే స్వామికి ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీదళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. ఉభయదాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు.అష్టోత్తర శతనామావళి నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి తదితరులు ఈసేవ నిర్వహించారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి కల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనంతో క్రతువు ప్రారంభించారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- పక్కాగా వ్యాక్సినేషన్
- సిబ్బందికి సూచించిన డీఎంహెచ్‌వో హేమంత్



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్

సబ్బవరం: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ సూచించారు. మండలంలోని గుల్లేపల్లి పీహెచ్‌సీ పరిధి అమృతపురం సచివాలయంలో నిర్వహిస్తున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు కౌమార బాలబాలికలకు అందిస్తున్న సేవల గురించి ఏఎన్ఎం పి.పరమేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. కాలానుగుణంగా వేయాల్సిన టీకాలు, ఐఎఫ్‌ఏ మాత్రలు, కాల్షియం మాత్రలు, పోషక ఆహారం తనిఖీలు నిర్వహించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం పట్ల,వారి సుఖ ప్రసవం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.ఇటీవల జరిగిన ప్రసవాలపై ఆరా తీశారు. ఆస్పత్రుల్లో మాత్రమే 100 శాతం ప్రసవాలు జరిగే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. టీకాల కార్యక్రమం పరిశీలించి కోల్డ్ చైన్ సిస్టమ్ బ్రేక్ అవకుండా చూడాలని, అర్హులైన వారందరికీ సకాలంలో టీకాలు వేయాలన్నారు. హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. మందులు, తనిఖీ(టెస్ట్) కిట్లు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. ఆశ కార్యకర్తలతో ఈ ఆశ యాప్ గురించి చర్చించి తగు సూచనలు చేశారు. అనంతరం అక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్ ఎస్.రమణమ్మను గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు అందిస్తున్న పోషక ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు.

వెంకన్నకు విశేష పూజలు



సింహాచలం: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏకాదశి పురస్కరించుకుని స్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు. అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

డీసీసీబీ చైర్మన్ కోలాకు అభినందన



కోలా గురువులును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నూతన చైర్మన్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన కోలా గురువులుకు మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామ మత్స్యకార నాయకుడు బొంది అచ్చిబాబు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు తిక్కాడ సత్యనారాయణ, చింతకాయల కొర్లయ్య, పుష్యమిత్ర, చంటి, ఎస్.బాబూరావు తదితరులు కోలాకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొల్పాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

సింహాచలం: మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొల్పాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆయా పార్టీల పెందుర్తి ఏరియా కమిటీల ఆధ్వర్యంలో శనివారం చినముషిడివాడ కూడలి నుంచి సుజాతనగర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకుడు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు నెలల నుంచి మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన మహిళలపై అత్యాచారం చేసి హత్య చేసిన దారుణ ఘటనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీపీఎం నాయకురాలు రమణి మాట్లాడుతూ స్వదేశంలో హింసాకాండను ఖండించాల్సిన ప్రధాని నరేంద్రమోదీ స్పందించడం లేదన్నారు. సీపీఐఎంఎల్ నాయకురాలు నిర్మల మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రధాని మోదీ మౌనం వీడనాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వై.రాంబాబు, పెందుర్తిశాఖ నాయకులు ఆసిరి నాయుడు, అన్నపూర్ణ, సీపీఎం నాయకుడు అప్పలనాయుడు, రజినీ, సీపీఐఎంఎల్ నాయకులు రూప, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఈట్ రైట్ మేళా'

- మిల్లెట్ మేళాలో ఆకట్టుకున్న స్టాల్స్
- అధిక సంఖ్యలో హాజరైన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు



వాకథాన్‌లో పాల్గొన్న ఉక్కు నగర వాసులు



మిల్లెట్స్ మేళాలో స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎండీ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈట్ రైట్ మిల్లెట్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ), స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా ఉక్కు మల్టీపర్పస్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అరుల్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్యస్పృహతో చిరు ధాన్యాలకు డిమాండ్ పెరిగిందన్నారు. దైనందిన జీవితంలో మిల్లెట్స్ వినియోగం, ప్రాధాన్యం గురించి డాక్టర్ అరుల్ ఆనంద్, సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి, క్యూ1 ఇంటర్నేషనల్ ఫుడ్స్ సీఈఓ ఎస్. సుజాత శ్రీనివాస్, విశాఖ డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ, శ్రావణ్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జి. సాంబశివరావు తదితరులు వివరించారు. మేళాలో సృష్టి వరల్డ్ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన మిల్లెట్లు, మిలెట్లతో చేసిన వంటకాలను సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

ఉక్కు సెక్టార్లలో 'వాకథాన్'

ఈట్ రైట్ ఇండియా – 'సురక్షితంగా తినండి– ఆరోగ్యంగా తినండి– స్థిరంగా తినండి' నినాదంతో ఉక్కునగరంలో శనివారం ఉదయం నిర్వహించిన వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ముందుగా స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి, డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. సెక్టార్– 5 నుంచి సెక్టార్–1 మీదుగా అంబేడ్కర్ కళాక్షేత్రం గుండా సెక్టార్–6 వరకు వాకథాన్ సాగింది. అంతకు ముందు క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



పేదలకు చీరల పంపిణీ చేస్తున్న చొక్కాకుల వెంకటరావు తదితరులు

సబ్బవరం: మదర్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు అన్నారు. సబ్బవరం లోని మదర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరావు 100 మంది పేద మహిళలకు చీరలు,బియ్యం పంపిణీ చేశారు.అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. సేవా కార్యక్రమాలకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సత్య గంగరాజు,డైరెక్టర్ పి. శ్రీనివాసరావు,తారకేశ్వరి,సుశీల,మౌనిక,రమేష్ విలియం కేరి, దెడ్డం పద్మావతి,పల్ల రమణ పాల్గొన్నారు.

ఆటోలో మహిళపై మూకుమ్మడి దాడి

- బెదిరించి పుస్తెలతాడు లాక్కున్న దుండగులు
- నిందితులను పోలీసులకు అప్పగించిన స్థానికులు

సబ్బవరం:ఆటోలో ప్రయాణిస్తున్న మహిళను బెదిరించి, పుస్తెలతాడు అపహరించేందుకు ప్రయత్నించిన నలుగురు నిందితులను శుక్రవారం రాత్రి స్థానికులు చాకచక్యంగా పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. బాధిత మహిళ, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకపల్లి శివారు సున్నంబట్టీలుకు చెందిన పల్లి సూరీడమ్మ డ్వాక్రా సమావేశానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు శుక్రవారం రాత్రి అనకపల్లి జంక్షన్ వద్ద ఆటో ఎక్కింది. అప్పటికే ఆ ఆటోలో ఇద్దరు మహిళలు, మరో యువకుడు ఉన్నారు. సున్నంబట్టీల వద్ద బ్రిడ్జి కిందకు రాగానే ఆటో ఆపమని కోరగా, ఆటోలోని ముగ్గురూ మూకుమ్మడిగా సూరీడమ్మపై దాడి చేసి, మెడలోని బంగారుతాడును బ్లేడుతో కత్తిరించారు. చంపేస్తామని బెదిరించి తాడు లాక్కున్నారు. దీంతో సూరీడమ్మ గట్టిగా అరవడంతో ఆటో వెనుక వస్తున్న నోట్ల కృష్ణ, వెంకటేష్ ఆటోకు అడ్డంగా బైక్ నిలిపి నలుగురినీ పట్టుకుని, బంగారు తాడు సూరీడమ్మకు అప్పగించారు. దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్ మేకల శ్రీనుతోపాటు ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు గొర్లి రమణి, మేకల లక్ష్మి, మేకల ప్రకాష్‌ను శుక్రవారం రాత్రి పోలీసులకు అప్పగించారు. బాధితురాలు సూరీడమ్మ ఫిర్యాదు మేరకు సీఐ రంగనాథం కేసు దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడ్డ నలుగురు గాజువాకకు చెందిన వారని తెలుస్తోంది. ఆటోను అద్దెకు తీసుకొని ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. బాధితురాలు సూరీడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రంగనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ గ్యాంగ్ ఇంకా ఎక్కడెక్కడ ఇలాంటి దొంగతనాలకు పాల్పడిందోనని పోలీసులు కూపీ లాగుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే లక్ష్యం



898వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు దేశవ్యాప్త ఉద్యమాలకు సైతం సిద్ధమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 898వ రోజు శనివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తు ఊరుకోబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే పార్లమెంట్ సమావేశాల్లో ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పురందేశ్వరిపై మండిపడ్డ అఖిలపక్షం



సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

దాబాగార్డెన్స్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. ఆమె మాటలు వింటుంటే తెలుగు రాష్ట్ర ప్రజల కోసం కాకుండా.. కేంద్రంలోని బీజేపీకి తొత్తుగా మారినట్టు ఉన్నాయని ఎద్దేవా చేశారు. విశాఖ ఎంపీగా.. కేంద్ర మంత్రిగా పని చేసి విశాఖకు, ఆంధ్ర రాష్ట్రానికి ఏమీ చేయకపోగా.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ పంచన చేరి, ఆ పార్టీకి అనుకూలంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు బీజేపీపై తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను ఏ ఒక్కటీ పూర్తి చేయకుండానే తప్పుడు ప్రచారానికి బీజేపీ నూతన అధ్యక్షురాలు పూనుకున్నారని ఎద్దేవా చేశారు. తాజాగా అదానీతో బీజేపీ సర్కారు కుమ్మక్కై స్టీల్ ప్లాంట్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తుందని ఆరోపించారు. బీజేపీ ఇప్పటికైనా కపట నాటకాలు, అబద్ధాలు ఆపి విశాఖ రైల్వేజోన్ నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అటవీహక్కుల సంరక్షణ చట్టంలో సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినా, లెక్క చేయకుండా బీజేపీ ఆమోదింపజేసిందన్నారు. దీంతో ఉత్తరాంధ్ర గిరిజనులు తీవ్ర ప్రమాదంలో పడ్డారని తెలిపారు. ఐదేళ్లలో రైల్వే జోన్‌కి ఎంత ఖర్చు పెట్టారు? ఎంత అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా? అంటూ పురందేశ్వరికి బహిరంగ సవాల్ విసిరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డాక్టర్ బి. గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకుడు వై. కొండయ్య, కె. శంకరరావు, కె. దేవ, ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఎరీనా నిర్వహణ జీవీఎంసీయే చేపట్టాలి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా నిర్వహణ బాధ్యతలు జీవీఎంసీ చేపట్టాలని వార్వా, నివాస్ సంస్థలు డిమాండ్ చేశాయి. శనివారం ఇండోర్ స్పోర్ట్స్ ఏరీనా ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సహానీ అనే ప్రైవేట్ సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. వార్వా జోన్–3 కార్యదర్శి కుమార్ మంగళం మాట్లాడుతూ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా నగరంలో సామాన్యులకు సైతం అందుబాటులో ఉండాలన్నారు. వార్వా జిల్లా అధ్యక్షుడు ఎస్ ప్రకాశరావు, జేపీ శర్మ, రమాప్రభ పాల్గొన్నారు.

కార్మికుల చేతుల్లో స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం సంజీవరావు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు ఉక్కు కార్మికుల చేతుల్లో ఉందని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కె. సంజీవరావు అన్నారు. కోక్‌ఓవెన్స్ విభాగంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్లాంట్ గతంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొందన్నారు. ఉద్యోగుల సమష్టి కృషి వల్ల అనేక అవరోధాలను ఎదుర్కొని ముందుకు సాగిందన్నారు. ఈ సందర్భంగా సంజీవరావు, ఆశాలత దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రుమెంటేషన్ డీజీఎం కె.ఎస్. జగన్నాథరావు, కిరణ్‌కుమార్, ఎ.దుర్గారావు, ఎల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్, రామచంద్రరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి సేవచేయడమే నిజమైన మానవత

ఏయూక్యాంపస్: సమాజానానికి నిరంతరం సేవ చేయడం మానవత సంస్థ లక్ష్యమని ఏయూ రిజిస్ట్రార్, మానవత సంస్థ ఏయూ శాఖ చైర్మన్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ హితమే మానవతతత్వమన్నారు. సమాజంలో శాంతిని నెలకొల్పే దిశగా సంస్థ సభ్యులు కృషి చేయాలని సూచించారు. పర్యావరణ చైతన్యం పెంపొందించడం, విద్యార్థుల్లో నైతిక విలవులు పెంపు, అనాథలకు చేయూత, మనోధైర్యం నింపడం, యువతకు కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలన్నారు. రానున్న ఏడాది కాలంలో సమాజ హిత కార్యక్రమాలను విరివిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏయూ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.ఏ.డి పాల్, కో చైర్మన్ ఆచార్య కె.సీతామాణిక్యం, కన్వీనర్ డాక్టర్ కె.రాజ మాణిక్యం, కార్యదర్శి డాక్టర్ జి.రవి కుమార్, సంయుక్త కార్యదర్శి నరేష్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎస్.రామకృష్ణ, పూర్వ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శన రావు, పూర్వ అధ్యక్షుడు ఆచార్య పరమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

భూ పరిమాణం చిన్నదవుతోంది



భూ పరిమాణంపై రూపొందించిన చిత్రాలు చూపుతున్న శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్ : వాతావరణంలో వస్తున్న మార్పులు.. ముడి చమురు రీసైకిల్ కాకపోవడంతో భూమి పరిమాణం చిన్నదవుతోందని నగర వాసి బి. శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై శాస్త్రవేత్తలు ఏకీభవించరని, కానీ రానున్న రోజుల్లో పెను ప్రమాదం పొంచి ఉందని, మానవాళి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి పరిమాణం చిన్నదవుతుందనే విషయంపై తాను తీసిన డాక్యుమెంటరీ త్వరలోనే విడుదల చేయనున్నట్టు చెప్పారు. ముందుగా మేల్కొనకపోతే 2030 నుంచి మానవాళికి ప్రమాదం పొంచి ఉందని, 2060 నాటికి మానవజాతి లేకుండా పోయే అవకాశం ఉందన్నారు. శరవేగంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు ముడి చమురు వినియోగించకుండా బ్యాటరీ వాహనాలు వినియోగించుకోవాలని అన్నారు. సమావేశంలో జి. శివకుమార్ పాల్గొన్నారు.